

# భవానీద్వీపం

-వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 45 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

జంకును, విస్మయాన్ని కలిగించే తెల్లని రంగులో మిలమిల లాడిపోతున్నది ఆ సింహం. అచ్చమైన తెలుపు కాదు. తెలుపు గోధుమరంగు కలిసి కళ్ళు జిగేలుమనేలా మెరుస్తున్న రంగు. ముదురు పసుపు రంగు కనులు గుండ్రంగా తిప్పుతూ కలయజూసింది. తోకను జండాకొయ్యలా నిటారుగా నిలిపింది. శరీరంమీది గోధుమరంగు రోమాలు ముళ్ళలా నిక్కబొడుచుకున్నాయి. పెద్ద పుచ్చకాయలా నోరును తెరిచి ఆవులించింది. ముందుకాళ్ళమీద, వెనుకకాళ్ళమీద భారీ శరీరాన్ని సాగదీసింది. తోకను గుండ్రంగా తిప్పుతూ నిశితంగా పరిశీలిస్తున్నట్టు చూసింది. ఒళ్ళు జలదరించేలా గర్జనలు చేసింది.

మొదలు భయంతో నిలువెల్లా వణికిపోయాడు శఠగోపాచార్యులు. తరువాత భయం స్థానంలో సంభ్రమం కలిగింది. అప్రయత్నంగా దివ్యమైన స్తుతి వెలువడింది ఆయన నోటివెంట. 'మారి మలై ముళఙ్జిల్ మన్నిక్కిడన్దుఅజుమ్..' అని మైమరచి పాడసాగాడు. జగజ్జనని ఆండాళ్ పాడిన తిరుప్పావైలోది అది. దివ్యమైన సింహంతో పోల్చి పరమాత్మను స్తుతించిన గేయం అది. ఎంతసేపు అలా మైమరచి గానంచేశాడో ఆయనకు తెలియదు. గర్జనలు చేయడం ఆగిపోయింది. ప్రసన్నంగా, గంభీరంగా చూడసాగింది ఆ సింహం.

చిత్రం! చూస్తుండగానే ఆ సింహం ముఖ కవళికలు మారిపోయాయి. నెమ్మదిగా నెమ్మదిగా సింహంరూపు కరిగిపోతున్నది. జూలు బవిరిగడ్డంగా మారిపోయింది. సింహం ముఖం ఆ ఉదయం చూసిన బైరాగి ముఖంలా మారిపోయింది. పద్మాసనం వేసుకుని నింపాదిగా కూర్చున్నాడు. అవే తీక్ష్ణమైన చూపులు చూస్తూ ప్రశ్నించాడు.

'ఇకనైనా ఒక ఇంటివాడిని చెయ్యవా నీ కొడుకును?'

'చేద్దామనే అనుకుంటున్నాను. తగిన పిల్ల దొరకొద్దూ?'

'పిల్ల బంగారంలా వుంది. ఏ యింటికి కోడలై కళాకాంతులు చిమ్ముతుందో' అన్నావుగా! ఏం? ఆ పిల్లను కోడలిగా తెచ్చుకోరాదూ?'

'నేనా? ఎవరిని చూసి అన్నాను? ఎప్పుడన్నాను?'ఆశ్చర్యంగా అడిగాడు. గుర్తు తెచ్చుకోడానికి ప్రయత్నించాడు.

'జోగులాంబ సన్నిధిలో! స్థానాచార్యుల కూతురును చూసి!'

'ఆ అమ్మాయా! అమ్మాయి బంగారం!' చప్పున అన్నాడు శఠగోపాచార్యులు. అంతలోనే గుర్తొచ్చి సర్దుకుని అడిగాడు.

'కానీ, తెలిసే అడుగుతున్నారా, వేళాకోళమా? ఎక్కడి తెంగలై వైష్ణవుల పిల్లడు, ఎక్కడి జోగులాంబ స్థానాచార్యుల శైవుల కూతురు? మావాళ్ళు వెలేయరూ?'

పిచ్చివాడా! అన్నట్టు పకపకా నవ్వాడు బైరాగి. 'ఇందాక తిరుప్పావై పాశురం వల్లెవేశావుగా! తిరుప్పావై వ్రతం కదూ?' చిలిపిగా చూస్తూ ప్రశ్నించాడు బైరాగి.

'అవును! ధనుర్మాస వ్రతం. తిరుప్పావై వ్రతం!' యిప్పుడు ఆ ప్రస్తావన ఎందుకు అన్నట్లు చూస్తూ బదులిచ్చాడు శఠగోపాచార్యులు.

'పరమాత్ముడితో తనకు వివాహం జరగాలని కోరికతో ఆ వ్రతం చేసిందికదూ గోదమ్మ?' బైరాగి అడిగాడు. 'ఔ'నని బదులిచ్చాడు శఠగోపాచార్యులు.

'ఆ వ్రతంలో ఎవరిని పూజించింది గోదాదేవి?'

'కాత్యాయనిని..' అంటూ ఠక్కున ఆగిపోయాడు శఠగోపాచార్యులు. యిప్పుడు అర్థమైంది బైరాగి ఎందుకు యిదంతా అడుగుతున్నాడో.

'కాత్యాయని అంటే జోగులాంబే కాదూ?' తెచ్చిపెట్టుకున్న అమాయకత్వంతో అడిగాడు బైరాగి. శఠగోపాచార్యులు సమాధానమివ్వలేదు. ' మరి జోగులాంబ, అదే, కాత్యాయని 'వడగలై'నా? 'తెంగలై'నా? రెట్టిస్తున్నట్టు అడిగాడు బైరాగి.

'వైష్ణవానాం శివో యథా..అనలేదూ పురాణం? వైష్ణవులలో ఉత్తముడు శివుడు అని కాదూ? మరి శివుడు 'వడగలై'నా? 'తెంగలై'నా? యిప్పుడు నిలదీస్తున్నట్లుగా ఉన్నది బైరాగి గొంతు. శఠగోపాచార్యులు మాట్లాడలేదు.

'యథా నద్యః స్యందమానాః సముద్రేస్తం గచ్ఛంతి నామరూపే విహాయ..తథా విద్వాన్ నామరూపాద్విముక్తః పరాత్పరం పురుషముపైతి దివ్యం' ..నీకు తెలియదూ? ప్రవహించేప్పుడే వేర్వేరు పేర్లు నదులకు. సముద్రంలో కలిసినతర్వాత యేది గంగ? యేది యమున? యేది సరస్వతి?' యిప్పుడు పసిపిల్లాడికి అనునయంగా అర్థం అయ్యేట్లు చెబుతున్న అమ్మ గొంతులా వున్నది బైరాగి గొంతు. 'ఆరాధనామార్గాలు అన్నీ వేర్వేరు నదులు. పరతత్త్వం ఒక సముద్రం' ఉన్నట్టుండి చెంగున లేచాడు బైరాగి.

'అది తెంగలై కాదు. వడగలై కాదు. వైఖానసం కాదు. శైవం కాదు. వైష్ణవం కాదు. శాక్తేయం, గాణాపత్యం, మరొకటీ కాదు. అది ఏదీ కాదు. అది అన్నీ కూడా ' అని నవ్వుతూ వంగి శఠగోపాచార్యుల ముఖంలోకి తొంగిచూశాడు. 'ఆ పరతత్త్వాన్ని చూసింది ఎవరు? తెలుసుకున్నది ఎవరు?' అంటూ తంబురా మీటుకుంటూ చిందులేయడం మొదలుబెట్టాడు. తీయగా, గంభీరంగా బైరాగి గొంతు మ్రోగింది.

ఎవరూ విననిది,అన్నీ వినునది
ఎవరూ కననిది,అన్నీ కనునది
ఎవరనరానిది,అన్నిటి ననునది
ఎవ్వరికైనా స్పృశింపరానిది,నశించి పోనిది
వాసము లేనిది,'వాసన' లేనిది,

అన్నిట 'తానై',అన్నిట 'నేనై',

శూన్యపు మేనై,మాయల జాణౌ

నదే భవిష్యం ,అదే రహస్యం

వర్తమానమది,గతమయ్యదియే!

తీసివేతలో తీసిపోనిది, వడపోతలలో తేలిపోనిది,

ఏకతమున ఏకాంత సీమలకు

తరలువారిటకు మరలిరాని

ఘన సన్నిధానమది, పెన్నిధానమది!

గంతా, మంతా, అంతా తానై,

కర్తా, భర్తా, హర్తా తానై

నర్తన, మాయల వర్తన జేసే

వేద నాదమది, విధి విధానమిది!

దానికి లేదే కులమూ, మతమూ!

కాదే జాతీ అహితము, హితమూ!

ఆతండొకడే సత్యుడు, ఎరిగిన వాడే నిత్యుడు!

అంతలోనే ఎవరో బలవంతంగా ఆపుజేసినట్లు వున్నట్టుండి ఆగిపోయాడు బైరాగి. 'నీ వంశం తరించే వారసుడు రావొద్దూ?' అని చిన్నపిల్లాడిలా నవ్వాడు. సమ్మోహితుడు అయినట్లుగా పలుకు లేకుండా వింటున్నాడు శఠగోపాచార్యులు.

'ఆ అమ్మాయి కారణజన్ముడిని కనడంకోసమే పుట్టింది. అందుకోసమే ఆలంపూరులో అడుగుబెట్టింది! ఇంకో రహస్యం చెప్పనా? అసలా అమ్మాయి..' అని మధ్యలోనే ఆగిపోయాడు బైరాగి. ' అన్నీ నేనే చెప్పడం ఎందుకులే! తన కుమార్తె గురించి బాలబ్రహ్మేశ్వర శర్మ స్వయంగా చెబుతాడులే! లే! లే! అంటూ పెద్దగా నవ్వాడు బైరాగి.

అలా ఆపకుండా నవ్వుతూనే వున్నాడు బైరాగి . తెరలు తెరలుగా ఆ నవ్వు చెవులలో మారుమ్రోగుతున్నది. బైరాగి రూపం మంచుతెరలాగా కరిగిపోతున్నది. ఆ గొంతుమాత్రం వినిపిస్తూనే వున్నది. చప్పున మెలకువ వచ్చింది శఠగోపాచార్యులకు. కొద్దిగా ఎడంగా గాఢ నిద్రలో భార్య కనిపించింది. యిటుప్రక్కన కొడుకు సుదర్శనాచార్యులు మంచి నిద్రలో ఉన్నాడు. 'నీ వంశం తరించే వారసుడు రావొద్దూ?' అన్న బైరాగి గొంతు చెవులలో మరలా మ్రోగింది. అప్పటిదాకా కలగన్నట్లు అప్పుడు గ్రహించాడు శఠగోపాచార్యులు. ఎంత విచిత్రమైన కల అనుకోకుండా వుండలేకపోయాడు. జోగులాంబ సన్నిధిలో తండ్రితో కనిపించిన కన్య గుర్తుకొచ్చింది. కొడుకును చూస్తూ ఆలోచనలో మునిగిపోయాడు. కొద్దిగా మెసిలి లేచి కూర్చున్నాడు సుదర్శనాచార్యులు. చమురు దీపం వెలుగులో తననే చూస్తూ కూర్చున్న తండ్రి కనిపించాడు. ఉలికిపడ్డాడు.

'ఏమిటి నాయనా? నలతగా వున్నదా?' అంటూ తండ్రిని సమీపించాడు. ఆ అలికిడికి తనూ లేచింది మల్లమాంబ. భార్యను, కొడుకును పక్కన కూర్చోబెట్టుకున్నాడు శఠగోపాచార్యులు. విచిత్రమైన తన కల గురించి చెప్పాడు.

రెండురోజుల తీవ్ర తర్జన భర్జనల తర్వాత  శఠగోపాచార్యుల మేనా హేమలాపురి జోగులాంబ సన్నిధికి బయలుదేరింది. మల్లమాంబ అభ్యంతరాలను శఠగోపాచార్యులు త్రోసిపుచ్చాడు. కలలో బైరాగి పలికినవి అన్నీ నిజాలే అని నిశ్చయించుకున్నాడు. తన కుమార్తె గురించి బాలబ్రహ్మేశ్వర శర్మ స్వయంగా ఏం చెబుతాడో తెలుసుకున్న తర్వాతే ఒక నిశ్చయానికి వస్తాను అని భార్యకు మాట అయితే యిచ్చాడు. పెద్దలు, మిత్రులు, శ్రేయోభిలాషులు కొందరు తోడు కదిలారు.

శఠగోపాచార్యుల ప్రస్తావనకు బాలబ్రహ్మేశ్వర శర్మ తిరస్కారాన్ని చూపలేదు కానీ ఆశ్చర్యపడ్డాడు. ఆనందపడినట్లు కూడా కనిపించాడు. విచిత్రంగా ఆతడి ఇల్లాలు కూడా ఏమీ అభ్యంతరం వున్నట్లు కనిపించలేదు. కొంతసేపు ముచ్చటించిన తరువాత శఠగోపాచార్యులను ఒక్కడినీ లోపలకు తీసుకువెళ్ళాడు బాలబ్రహ్మేశ్వర శర్మ. పరమాత్ముడి లీలలకు యిది మరొక తార్కాణం అన్నాడు. ఆనందము, ఆశ్చర్యము తాండవం చేస్తుండగా విచిత్రమైన నిజాన్ని వెల్లడించాడు. ఆతని ప్రక్కనే భార్య సాక్షిగా అన్నట్లు వున్నది.

సంతానం లేని తమ దంపతులు పదమూడేళ్ళక్రితం కంచి అమ్మను వేడుకొనడానికి వెళ్ళినట్లు చెప్పాడు. మూడు రాత్రుళ్ళు అమ్మ సన్నిధిలో నిద్రచేసినట్లు చెప్పాడు. తిరుగు ప్రయాణంలో కావేరీ తీరంలోని అడవి మార్గంలో పొదలమధ్య గుండెలు అవిసేలా ఏడుస్తున్న నెలల పసికందు, బాలిక కనిపించింది అని చెప్పాడు. కొద్ది దూరంలో బహుశా ఆ శిశువు తండ్రి కావొచ్చు, తీవ్రమైన గాయాలతో కనిపించినట్టు చెప్పాడు. రక్తపు మడుగులో విగత జీవుడై పడివున్నాడని చెప్పాడు. అతడి గాయాలను, పరిసరాలను పరిశీలించి భార్యను పులిబారినుండి కాపాడుకునే ప్రయత్నంలో ప్రాణాంతకమైన గాయాలకు ఎర ఐనట్లు తేల్చుకున్నామని చెప్పాడు. పసికందు తల్లిని పులి నోటకరుచుకుని పోయినట్లు పొదలు, కొమ్మలకు చిక్కుకున్న చీర చెంగు పేలికలను చూసి నిర్ధారించుకున్నట్లు చెప్పాడు. చేతిసంచిలోని తిరుమణి, తిరుచూర్ణాలు, తిరుమాళిగ చూసి శ్రీరంగం వెళ్తూనో, వస్తూనో పులిబారిన పడిన వైష్ణవుడు అని గ్రహించినట్లు చెప్పాడు. నోటమాట లేకుండా ఐపోయాడు శఠగోపాచార్యులు. కలలో కనిపించిన బైరాగిని తలచుకుని నమస్కరించుకున్నాడు.

★★★★★★★★★★★★★

స్పృహలో లేనట్టుగా మగతగా పడివున్నాడు సుదర్శనచార్యులు. సంవత్సరం క్రితం జరిగిన గాథ మనసులో సుడులు తిరుగుతున్నది. బైరాగి జోలెలో కుదుపులకు చిన్నగా ఎగిరిపడుతూ కనుమరుగైన లేత పాదాలు పదే పదే గుర్తుకు వస్తున్నాయి. తెరలు తెరలుగా తెలియని దుఃఖం తన్నుకువస్తున్నది. నారసింహా! నారసింహా! అని ఆక్రోశిస్తూ కుమిలిపోవడం మొదలుబెట్టాడు. తెరపిలేకుండా వర్షం విసురుతూనే వున్నది.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS